# పసివాడికి అర్థంకాని సమస్య

★

కథానిక

సులోచన

క్లాసంతా నిశ్శబ్దంగా ఉంది, ప్రక్క క్లాసులో నుంచి వచ్చే కొద్ది గోల మినహాయించి. జగన్నాథం పంతులుగారు సత్యహరిశ్చంద్రుని పాఠం పిల్లలకు అతిసులభంగా బోధపడే పద్ధతిలో విడమర్చి, యాక్షన్ చేస్తూ, నవ్విస్తూ చెబుతున్నారు. అయినప్పటికీ శ్రీరాములు లాంటివాళ్లు ఏ కొద్దిమందో తప్ప శ్రద్ధగా వినటం లేదు. "ఒక్కసారి ఉన్నట్టుండి బ్రహ్మాండంగా మబ్బులుకమ్ముకొచ్చి నాలుగురోజులుపాటు యెడతెరపిలేకుండా వాన కురిస్తే—ఎంత బావుంటుంది? ఆ నాలుగురోజులూ బడివుండదు" అనుకుంటున్నాడు సోమయాజులు.

"గొందిలో సుబ్బమ్మగారి దానిమ్మచెట్టున కాయలు ఉన్నవో, లేక జగ్గాయిగాడు కోసుకెళ్ళాడో"—ఆలోచిస్తున్నాడు వెంకటేశ్వర్లు.

"పొద్దున నాన్న జేబులోంచి దొంగతనంగా తీసి గూట్లో దాచిన అణాన్నర ఉందో, చిట్టాడు దొంగిలించి వేరుశెనక్కాయలు కొనుక్కున్నాడో—" కరణంగారి మనుమడికీ మనశ్శాంతి లేకుండా ఉంది.

సుబ్బులుకు బిళ్లంగోడు ఆట మనస్సులో తిరుగుతోంది. ఎప్పుడు వెళ్ళి కాలువలో ఈత కొడదామా అని లొట్టలు వేస్తున్నాడు శ్రీహరి. జేబులోని కారప్పూస ఎవరికంటా పడకుండా అతిప్రయాసతో ఒక్కొక్కపూసే తింటున్నాడు గురునాథం. కాని శ్రీరాములుమాత్రం సత్యహరిశ్చంద్రుని పాఠంవల్ల ఆకర్షింపబడ్డాడు. పంతులుగారి మాటలు వాడి బుల్లిబుర్రకు వేగంగా నాటుకుంటున్నాయి.

"ఎల్లప్పుడు సత్యమునే పలుకవలయును. అబద్ధమాడరాదు, అబద్ధమాడినవారలు దేవునిచే శిక్షింపబడుదురు. సత్యహరిశ్చంద్రుడు కష్టములో, ఆపదలో సహితము సత్యమునే పలికెను. కనుక మీరెల్లరు సత్యమునే పలుకవలెను." జగన్నాథం పంతులుగారునొక్కి పలికిన ఈమాటలు శ్రీరాములు హృదయంలో గట్టిగా నిలిచినాయి.

"ఇక అబద్ధం ఆడకూడదు. పంతులుగారు చెప్పినటు ఎప్పుడూ సత్యమునే చెప్పాలి" అనుకున్నాడు శ్రీరాములు. కాకతాళీయంగా యేడేళ్ళ ప్రాయంగల వాడి హృదయం—జీవితంలో ఒక సత్యమైన మార్గాన్ని కనుక్కొన్నటు, జీవితాన్ని ప్రశాంతంగా ఉత్తమ పద్ధతుల్లో గడపవచ్చునన్నట్టు సంతోషపడసాగింది. కాని వెంటనే వాడి మనస్సు చివుక్కుమంది. ఎందువల్లనంటే వాడు ఇదివరలో చాలా అబద్ధాలు ఆడి ఉన్నట్లు వెంటనే స్ఫురణకు వచ్చింది.

ఒకసారి-తను చెల్లెలి చిరుతిండి అలమారాలోంచి దొంగిలించి, తిని, తినలేదని అబద్ధం ఆడి పైగా తల్లిచేత చెల్లెలినే తిట్టించాడు. మరోసారి గాలిపటం కొనుక్కునే నిమిత్తమై నాన్న జేబులోంచి బేడకాజేసి, లేదని అబద్ధమాడాడు.

అయితే శ్రీరాములు "ఇకనుంచి బుద్ధికలిగి అబద్ధాలు ఆడకుండా ఉంటానుగా!" అని కచ్చితంగా అనుకోవటంచేత—ఒకవిధమైన తృప్తి చెందాడు. పంతులుగారు అలవాటు ప్రకారం జేబులోంచి పొడుంకాయ తీయటంలో పిల్లలంతా ఫక్కున నవ్వారు. కాని శ్రీరాములు నవ్వలేదు; ఆ క్షణాన్నుంచి వాడికి పంతులుగారు సత్యహరిశ్చంద్రుడు లాగా కనిపించారు. తరువాత పంతులుగారి తీక్షణమైన చూపులతో గోల సద్దుమణిగింది.

కొంచెం సేపున్నతరువాత కృష్ణాయి లేచి, "పంతులుగారండీ. రంగడు నాజుట్టు పీకాడండీ" అన్నాడు.

"ఏరా, రంగా!" గర్జించాడు జగన్నాథం పంతులుగారు.

"ఒట్టిదేనండి. అబద్ధమండీ" అన్నాడు రంగడు.

శ్రీరాములుకు రంగడు అబద్ధమాడుతూన్నట్టు తోచింది.

పంతులుగారు బెత్తం సవరిస్తూ, "వెధవా! ఇంతసేపూ సత్యహరిశ్చంద్రుడి పాఠం విని, నా ఎదుటే అబద్ధం ఆడతావూ!" అని రంగడి వీపు మీద నాలుగు దెబ్బలు వేశారు.

"అబద్ధం ఆడినవాడి గతి యింతే" అన్నారు పంతులుగారు-దెబ్బలు తిని యేడుస్తూన్న రంగడిని మిగతా పిల్లలకు చూపిస్తూ.

కృష్ణాయి విజయగర్వంతో నవ్వాడు.

"నిజమే కాబోలు" అనుకున్నాడు శ్రీరాములు.

* * *

బడినుంచి రాగానే పలకా పుస్తకాలు కొయ్య భోషాణం మీద వేసి, అరుగుమీద కూర్చొని బియ్యపుచేట ముందుంచుకొని బియ్యంలో వడ్లగింజలు, మట్టిగడ్డలు యేరివేస్తూన్న తల్లి దగ్గరకు వెళ్లి అడిగాడు—

"అమ్మా! అమ్మా! అబద్ధం ఆడవచ్చా?"

సీతారావమ్మ కొడుకు అమాయకత్వానికి సంతోషించి, తల నిమురుతూ, "ఆడకూడదు నాయనా. ఎప్పుడూ నిజమే చెప్పాలి. అబద్ధాలు చెపితే మంచిపిల్లవాడనరు. మంచి పిల్లలు అబద్ధాలు చెప్పరు"అన్నది.

"మరి... మరి నువ్వూ, నాన్నా ఎప్పుడూ నిజమే చెబుతారా!"అన్నాడు శ్రీరాములు కుతూహల పూరితమైన ముఖం పెట్టి.

"ఆఁ! మేము పెద్దవాళ్ళం ఎప్పుడూ నిజమే చెపుతాం. అసలు పెద్దవాళ్లు అబద్ధం ఆడరు. పిల్లలు అబద్ధాలు ఆడతారు" అన్నది సీతారావమ్మ.

"రంగడు పిల్లవాడు కావటం చేత కాబోలు అబద్ధం ఆడాడు. మరి తనని అమ్మ అబద్ధం ఆడవద్దంటుందేఁ! తను పిల్లవాడుగా—" సందేహం కలిగింది శ్రీరాములుకు.

శ్రీరాములు ముఖంలోని మార్పును గ్రహించి అన్నది సీతారావమ్మ, "చిన్నప్పట్నుంచీ అబద్ధాలాడటం నేర్చుకొంటే పెద్ద అయిన తరువాత చెడిపోతారు. అందువల్ల అబద్ధాలు చిన్నపిల్లలు ఆడకూడదు."

"చెడిపోవటమంటే యేమిటే అమ్మా—" అన్నాడు శ్రీరాములు.

"అబ్బా! నన్ను విసిగించబోకురా. పొయ్యి మీద యెసరు నీళ్లు మసిలిపోతున్నాయి. తరువాత చెబుతాలే. పోయి ఆడుకో."

శ్రీరాములు ముఖం చిట్లించుకొని ఆటలకు వెళ్ళాడు.

పిల్లలంతా దేవాలయంముందు చేరి పట్టీ ఆట ఆడుతున్నారు. శ్రీరాములు కూడా ఆటలో కలిశాడు. ఎదుట చేతులు చాపుకొని యెలమీద తిరుగుతోన్న వెంకట్రావును తప్పించుకొని వెళ్ళాలని ప్రయాసతో, నేర్పుగా గిరికీలు వేస్తున్నాడు శ్రీరాములు. కాని ఒకపట్టాన లొంగటంలేదు వెంకట్రావు. కొంచెం కన్నుమలపనిచ్చి అవతల యెలలోకి జొరబడ్డాడు, శ్రీరాములు. ఔట్ చేయబోయి ముందుకు పడ్డాడు, వెంకట్రావు. కాని ఔట్ కాలేదు శ్రీరాములు. వెంట్రుకవాసిలో తప్పిపోయింది.

"ఔట్ అయ్యాడు రాములు" అని బిగ్గరగా అరిచాడు వెంకట్రావు.

శ్రీరాములు బిత్తరపోయాడు. "ఒటిదే-అబద్ధం"అన్నాడు.

"కాదు-నిజంగా ఔట్ అయ్యాడు. చొక్కా నా వేలుకు రాసుకుపోయింది" అన్నాడు వెంకట్రావు.

ఈ పిల్లల ఆట చూస్తున్న ఒక పెద్దమనిషి శ్రీరాములుకేసిచూసి, "వెధవా, అబద్ధం ఆడుతున్నావా" అన్నాడు.

తను అబద్ధం ఆడాడా? ఆడకూడదనుకొన్నాడే—తల్లీ, జగన్నాధం పంతులుగారూ మదిలో మెదిలారు. తను పిల్లవాడు తనకంటె కొంచెం పెద్ద వెంకట్రావు. ఆట చూస్తున్న పెద్దమనిషికూడా తను అబద్ధం ఆడినటు చెబుతున్నాడే! పెద్దవాళ్లు అబద్ధాలు చెప్పరుగా! ఛీ. తనే అబద్ధం ఆడాడు. నిజంగా చొక్కా వేలుకి రాసుకుపోయిందేమో!

శ్రీరాములు నిజంగా ఔట్ అయినట్టు ఒప్పుకొన్నాడు. వాడి ముఖంలో ఆ సమయంలో నెత్తురులేదు.

ఇంటికివొచ్చాక తను ఒక అబద్ధం ఆడినట్టు, ఇకముందు ఆడనని తల్లితో చెప్పేవరకూ వాడి మనస్సులోని చీకాకు తొలగలేదు. సీతారావమ్మ నవ్వుకుంది. శ్రీరాములుది పసిహృదయం. ఇతరు

లకు అపకారంచేయని అమాయకత్వం వాడిలో నిండి ఉంది. తాను నమ్మిన విషయాన్ని ఆచరణలో పెట్టలేక పోయినందుకు మనస్సును ఎంతో నిందించాడు. చేసిన అపచారాన్ని తల్లికి చెప్పే వరకూ వాడికి మనశ్శాంతి లేకపోయిందంటే వాడి హృదయనైర్మల్యం మనకు కళ్ళకు కట్టినట్టు అగపడుతుంది.

* * *

"అమ్మా! అమ్మా!" గుమ్మంలో ఉండి కేక వేశాడు శ్రీరాములు.

"ఏమిట్రా!" అన్నది సీతారావమ్మ.

"నాకు ఒకటి కావాలి" అన్నాడు శ్రీరాములు.

"ఏమిటది?"

"ఒక బేడ—"

"బేడా! ఎందుకు వెధవా! చిరుతిండి కొనుక్కు తినటానికా? వద్దు. జబ్బు చేస్తుంది. రేపు చేగోడీలు నేతితో వండిపెడతాను లే." అన్నది సీతారావమ్మ. నూనెచిరుతిళ్లు తింటే పిల్లలకు మహా చెడ్డరోగాలు వస్తాయని ఆవిడ విశ్వాసం.

"కాదే అమ్మా!-గాలిపటం కొనుక్కోవాలి" అన్నాడు శ్రీరాములు బుంగమూతి పెటి.

వాడు బడినుంచి వొస్తూ, రామచంద్రయ్య కొడుకు డాబామీద నుండి రంగురంగుల గాలిపటాన్ని యెగరవేయటం చూశాడు. తనుకూడా అట్లా ఎగరవేయాలనిపించటంలో పుల్లయ్యకొట్లో గాలిపటాలు ఉన్న సంగతి స్ఫురణకొచ్చింది.

"గాలిపటానికి బేడ దేనికీ- నాన్నగారు కట్టి పెడతారులే" అన్నది సీతారావమ్మ పిల్లవాడి ఉత్సాహాన్ని కనిపెట్టకుండా.

"అహా! కాదు. రంగులుదే కావాలి."

"నాదగ్గిర చిల్లరడబ్బుల్లేవు."

తల్లి అబద్ధమాడుతున్నదా అనిపించింది హఠాత్తుగా శ్రీరాములుకు. కాదు. తప్పు. తల్లి ఎందుకు అబద్ధమాడుతుంది? నిజంగాచిల్లరడబ్బులులేవేమో. తల్లి తనకంటె చాలా పెద్దది. అబద్ధమెందుకాడుతుంది? పిల్లలే అబద్ధమాడుతారు. శ్రీరాములు అరుగుమీద కూర్చొని లెక్కలు చేసుకుంటున్నాడు. బొరువకు ఎన్ని మణుగులో తేలక తికమకలు పడుతున్నాడు.

"అమ్మా! ఇటురావే" చెల్లెలు రిబ్బన్లు అమ్మే వాడిని తీసుకువచ్చింది.

"అమ్మ రిబ్బన్లు కొనదు. అమ్మదగ్గిర డబ్బుల్లేవు" అన్నాడు శ్రీరాములు ధీమాగా.

"ఫో నీకేం తెలుసు, ఫో." అన్నది చెల్లెలు.

సీతారావమ్మ వచ్చి రిబ్బన్లనాణ్యంచూస్తోంది. శ్రీరాములుకి అర్థం కావటంలేదు. చిల్లర డబ్బుల్లేవుగా? రిబ్బన్లు ఎట్లా కొంటుంది? ఒకవేళ ఉంచుకొనే...

"ఈ రిబ్బను ఎంతకిస్తావ్?" గులాబీరంగు యేరి అడిగింది సీతారావమ్మ.

"మూడణాలకు చిల్లికానీతగ్గదిలేదు" అన్నాడు రిబ్బను అమ్మేవాడు.

"అణాన్నర కివ్వు" అన్నది సీతారావమ్మ, అది అంతకంటె ఎక్కువ విలువ చేయదన్న చూపుతో.

"రాదు. ఆఖరిబేరం చెబుతున్నాను. బేడా అర్ధణాకు ఇస్తాను తీసుకోండి."

"మాకు దేనికి? ఇస్తే బేడకివ్వు. లేకపోతే నీ దార్ని నువ్వు వెళ్లు" అన్నది శీతారావమ్మ ఖచ్చితంగా.

"సరే. తీసుకోండి."

సీతారావమ్మ బొడ్లోనుంచి బేడబిళ్ళతీసి వాడికిచ్చింది. చెల్లెలు రిబ్బను చేత్తోపట్టుకొని శ్రీరాములు వంక చూసేప్పటికి వాడికి తల తీసేసినంత పనైంది. అమ్మ అబద్ధం ఆడింది. తనదగ్గర చిల్లర డబ్బులు లేవనిచెప్పి రిబ్బనుకొన్నది. అలాచెప్పటం అబద్ధంకాదూ! పెద్దవాళ్లు అబద్ధాలు ఆడతారా? ఆడవచ్చా!

"అమ్మా! మరి నువ్వు అబద్ధం ఆడావేం! పెద్దవాళ్ళు అబద్ధాలు ఆడరాదుగా" అన్నాడు శ్రీరాములు.

సీతారావమ్మకు బల్లెం పొడిచినట్లయింది. ఇది వరకు కొడుకుతో ఎవరు అబద్ధాలు ఆడతారో, ఎవరు ఆడరో వివరంగా చెప్పిన విషయం స్ఫురణకు వచ్చింది. కాని తను కొడుకు దృష్టిలో అబద్ధాలు ఆడే తల్లిగా కనిపించటం యేమంత మంచిదికాదు.

"ఈ బేడా నిన్నసాయంత్రం కూరగాయలు కొనగా మిగిలితే పెట్టెలో పెట్టేందుకు బద్ధకం వేసి గూట్లోవేశాను కామోసు, ఇప్పుడు ఎందుకొరకో గూటిదగ్గరకు వెళితే కనుపించింది. అంతే

కాని తల్లి అబద్ధం ఆడుతుందిరా!" అన్నది సీతారావమ్మ.

ఇది కేవలం పచ్చి అబద్ధమని నమ్మగలిగేంత వరకూ పెరగలేదు, శ్రీరాములు బుర్ర. నిజమే కాబోలు అనుకున్నాడు. తల్లీ, తండ్రీ అబద్ధాలు ఆడరనే దాన్ని మనస్సులోంచి తొలగించుకోవడం ఈ వయస్సులో వాడికి అలవికానిపని. తెల్లనివన్నీ పాలనీ, నల్లనివన్నీ నీళ్ళనీ విశ్వసించగలిగే బుద్ధే.

"ఛీ. అమ్మ అబద్ధాలు చెబుతుందని తను అనుమానపడటమేమిటి?" అనుకొని మెదలకండా ఊరుకున్నాడు శ్రీరాములు.

* * *

తను అబద్ధాలు చెప్పకుండా నిజాయితీగా బతుకుదామనుకోవటంలో శ్రీరాములుకు తెలిసింది-నిజం చెప్పినా అబద్ధం చెప్పినా తనకుకలిగే నష్టంకానీ, లాభంకానీ ఏమీలేదని. ఆ అభిప్రాయం ప్రకారం నిజం చెప్పడమే ఉత్తమంగా తోచింది వాడికి. ఈ నిర్ణయానికి వొచ్చిం తరువాత వాడు నిజాలు చెప్పటమే నేర్చుకొన్నాడు. ఒకరోజు బడికి పోనందుకు సరైన కారణమే చెప్పాడు, తలకాయ నొప్పని. అట్లా వంకపెట్టి గోలీలు ఆడటానికి కాదు. మరోసారి బళ్ళో పెన్సిలు దొరికితే, పోయినవాడు తనని వొచ్చి అడిగితే నిజం చెప్పి, పెన్సిలు ఇచ్చాడు. ఇక్కడ కొంచం శ్రీరాములు మనస్సు చలించిన మాట వాస్తవమే. అబద్ధం ఆడటంవల్ల కొంచెం లాభం లేకపోలేదని తెలుసుకున్నాడు. అబద్ధం ఆడి పెన్సిల్ ఉంచుకోవచ్చుగా. కాని తన నిర్ణయం జ్ఞాపకం వచ్చి ఇచ్చేశాడు. ఇటువంటివే మరి కొన్ని నిజాలు చెప్పాడు శ్రీరాములు. ఇంకో ముఖ్య విషయమేమిటంటే ఈనిజాలు చెప్పటం వలన వాడికి కొంత తృప్తి కలుగుతోంది. అబద్ధాలు ఆడేవాళ్ళని అసహ్యించుకుంటున్నాడు.

మధ్యాహ్నం సీతారావమ్మ కాఫీకాచి భోషాణంలోఉన్న పింగాణీకప్పూ ప్లేటూ తీసుకరమ్మని చెప్పింది శ్రీరాములుతో. చెల్లెలు తను తెస్తానంటూ భోషాణందగ్గరకు వెళ్ళింది. కాని శ్రీరాములే భోషాణంలోంచితీశాడు. చెల్లెలు తనకిమ్మని అడిగింది. ససేమిరా యివ్వనన్నాడు. అంతవరకు బాగానే ఉంది. కానీ గడపదాటుతూండగా వాటిని జార విడిచాడు, అవి పగిలిచక్కలైనాయి. శ్రీరాములుకు భయంవేసింది. అమ్మతప్పక కొడుతుంది. దెబ్బలు ఎట్లాతినాలి? అబద్ధంఆడితే! చెల్లెలు పగలగొట్టిందని చెపితే! అమ్మనమ్ముతుంది.- తనకు దెబ్బలు తప్పుతాయి.

కాని...కాని అబద్ధం ఎట్లాచెప్పడం? తప్పు కాదూ! తన నిర్ణయమేమిటి? ఇంతటిలోనే లొంగిపోవటమా?

అబద్ధంఆడితే పూర్తిలాభం ఉందని తట్టినప్పటికి శ్రీరాములు అబద్ధం చెప్పలేదు.

"నేనేపగలగొట్టానమ్మా!" అన్నాడు. తల్లి దగ్గర.

చెల్లెలు కిలకిల నవ్వింది.

"వెధవా! ముప్పావులాపెట్టి కొన్న వాటిని మట్టిపాలుచేస్తావా!" అని తల్లి వీపుమీద నాలుగు చరిచింది. నొప్పి పుట్టి యేడ్చాడు శ్రీరాములు.

"అబద్ధం ఆడితే ఈ దెబ్బలు తప్పేవిగా" అనే ఊహ అప్పుడు వాడిలో రాలేదు. నిజంచెప్పటంలో కొంతబాధ ఉందని తెలిసింది. వెంటనే శ్రీరాములుకు సత్యహరిశ్చంద్రుని పాఠం జ్ఞాపకం వచ్చింది.

"సత్యం చెప్పడంవల్లనే హరిశ్చంద్రుడు అన్ని కష్టాలు పడింది" అనుకొన్నాడు శ్రీరాములు. కాని లోకంలో నిజాలు చెప్పేవాడు కష్టాలెందుకు పడాలో అర్థంకాలేదు శ్రీరాములుకు.

వాడిదింకా చిన్న బుర్ర!

తన వయస్సు, భర్త జీతం, పిల్లల వయస్సు—యీ మూడు విషయాలూ మినహాయించి, తక్కిన విషయాల్లో నిజంమాటాడే స్త్రీ సత్యవాదినికిందే లెక్క.

* * * *

మనగురించి లోకం లక్ష అబద్ధాలు ప్రచారం చేసినా బాధపడనంతగా— మనం కప్పిపెట్టిన ఒక్క సత్యాన్ని లోకం తెలుసుకుంటే బాధపడతాం.—జాన్సన్